# ప్రేమ మధురం ప్రియురాలు కఠినం

-సి.ఎన్.చంద్రశేఖర్

"చంద్రం! నిర్మల పిలుస్తోంది నిన్ను"

పెళ్లి పనుల్లో బిజీగావున్న చంద్రం పిన్నమ్మ వచ్చి చెప్తే అక్క దగ్గరకు వెళ్లాడు. పెళ్లికూతురి మేకప్‌లో అందంగా, దిష్టి తగిలేలా వుంది నిర్మల.

"ఏమిటక్కా పిలిచావుట!"

"ఒరేయ్ చందూ! నాకెందుకో ఏడుపొస్తోందిరా. నిన్నూ, అమ్మానాన్నల్ని వదిలి ఎలా ఉండగలనురా నేను?"

నిర్మల కళ్లనిండా నీళ్ళు. బేలగా చంద్రం వైపు చూస్తూ అతని చేతిని గట్టిగా పట్టుకుంది.

"పిచ్చి అక్కా! అంత మంచివాడు, అందగాడు భర్తగా వస్తుంటే ఆనందంగా స్టెప్స్ వెయ్యాలిగాని ఇలా ఏడుస్తూ కూర్చుంటారా ఎవరైనా? పెళ్లయ్యాక చెన్నై వెళ్తావే అనుకో. హైదరాబాద్ నుంచి చెన్నై ఎంత దూరం చెప్పు. ట్రైన్‌లో వెళితే పన్నెండు గంటలు, ఫ్లైటులో అయితే ఓ గంట. నేనూ ఇంటర్వ్యూలకని చెన్నై వస్తూనే వుంటాను కదా. ఆ కన్నీళ్ళు తుడుచుకుని ఆనందంగా వుండు."

"అది కాదురా. పాపం అమ్మ ఇకపై అన్నీ తనే చేసుకోవాలి."

"నేను సహాయం చేస్తాలేవే. నేను బ్రహ్మచారిలా ఉండిపోతాననుకున్నావా ఏం? మా ఆవిడ వస్తుంది. నీ రోల్ తను తీసుకుంటుంది."

"అంతేనంటావా?"

"అంతే. నువ్వు మరీ ఇంత సెన్సిటివ్ అయితే ఎలాగే బాబూ. ఈ కాలం అమ్మాయిలు ఎంత ఫాస్ట్‌గా వున్నారు? ఇంకో విషయం. ఒకరోజు బావగారిని హిప్నటైజ్ చేసి హైదరాబాద్‌కు ట్రాన్స్‌ఫర్ అప్లికేషన్ పెట్టిద్దాం. నువ్వూ హైదరాబాద్ వచ్చేస్తావు."

అలాగేనన్నట్లు తలాడించింది నిర్మల.

అక్కను ఓదార్చి గది బయటకు వస్తూ ఓ చివర నిలుచుని అతన్నే చూస్తున్న ఓ అమ్మాయిని చూసాడు చంద్రం. చాలా అందంగా వుంది ఆ అమ్మాయి. చురుకైన కళ్లతో, కోటేరు ముక్కుతో, తెల్లని తెలుపుతో వున్న ఆ అమ్మాయిని చూడగానే మనసు పారేసుకున్నాడు చంద్రం.

గది బయటకు రాగానే పెళ్లి పనుల్లో మునిగిపోయాడు.

'ఎంత బాగా ధైర్యం చెప్పాడు? ఎంత అభిమానం అతనికి తన అక్కంటే? అందంగా కూడా ఉన్నాడు' అనుకుంది ఆ అమ్మాయి.

ఆ అమ్మాయి పేరు సుష్మ.

పెళ్లి నిర్విఘ్నంగా జరిగిపోయింది. పెళ్లి పనులతో బిజీగా వుంటూ, వచ్చిన వాళ్ళను రిసీవ్ చేసుకుంటూ, వంటవాళ్లను పురమాయిస్తూ అన్నిటా తానేలా తిరుగుతున్నాడు చంద్రం. అయితే ఓ రెండు కళ్ళు మాత్రం తననే చూస్తుండడం గమనించి ఎంతో గర్వపడ్డాడు, ఆనందపడ్డాడు. ఇదే ఇంకెవరి పెళ్ళో అయివుంటే ఈపాటికి ఆ అమ్మాయి గురించి ఆరాతీసి మాటలు కలిపేవాడే. అక్క పెళ్లి కనుక అతనికి తీరిక దొరకడంలేదు.

పెళ్లిరోజు రాత్రి శోభనం గదిని తన స్నేహితుల సహాయంతో అందంగా అలంకరించాడు చంద్రం. సినిమాల్లో చూపే విధంగా మంచం, మంచంపైన దీర్ఘ చతురస్రాకారంలో దారాలు కట్టి వాటికి మల్లెపూలు నిలువునా వ్రేలాడదీసాడు. బెడ్‌పై మల్లెపూలు, రోజాలు, మంచి పరిమళంగల సెంటు చల్లాడు. బయట నుంచి చూస్తే నిజంగానే ఓ సినిమా సెట్టింగులా ఉంది ఆ గది.

ఆ గదిని చూసిన ప్రతి ఒక్కరూ చంద్రాన్ని మెచ్చుకోసాగారు. ఆ విషయం ఆ నోటా, ఈ నోటా పెళ్లి పందిట్లో అందరికీ తెలిసి, అందరూ అదే పనిగా ఆ గదిని చూడటానికి రావడం మొదలుపెట్టారు.

సుష్మ కూడా విషయం విన్నది కానీ పెళ్లి కాని పిల్ల కావడంతో గదిని చూడడానికి సిగ్గుపడింది. అయితే ఆమె వదిన తనతో రమ్మని చెప్పడంతో ఆమెతోపాటు వెళ్లి చూసింది. ఉన్న వసతులతోనే అంత అద్భుతంగా అలంకరించిన అతని కళాభిరుచికి ముగ్ధురాలైంది. 'కమిట్‌మెంట్ వున్న వ్యక్తులు ప్రతి విషయంలోనూ తమ ప్రతిభ చూపిస్తారు' అనుకుంది.

***

మరుసటి రోజు మధ్యాహ్నం భోజనాలయ్యాక బంధువులందరూ వెళ్లిపోయారు. పెళ్లికొడుకు వాళ్ళు సాయంత్రం చెన్నైకి ట్రైనులో బయలుదేరడానికి సిద్ధమవుతున్నారు.

వాళ్లతోపాటు చంద్రం తల్లిదండ్రులు కూడా కూతురిని అత్తవారింట్లో దిగబెట్టి రావడానికి బయలుదేరుతున్నారు.

సత్రం ఖాళీ చేయడానికి అన్ని సామాన్లు ప్యాక్ చేసి ఇంటికి పంపిస్తున్నాడు చంద్రం. అప్పటికే చాలావరకు ఫ్రెండ్స్‌తో ఇంటికి పంపించేసాడు. మిగిలిన కొద్ది సామాన్లను తను ఒక్కడే కూర్చుని ప్యాక్ చేయసాగాడు.

ఎదురుగా ఎవరో నిలబడినట్లనిపించి తలెత్తి చూసాడు. సుష్మ ఉంది.

లేచి నిలబడి "చెప్పండి" అన్నాడు.

"మేము బయలుదేరుతున్నాము. పెళ్లి బాగా చేసారు. మీ ఆదరణ, కన్సర్న్ మాకెంతో నచ్చింది" అంది.

"అది మా డ్యూటీ. పెళ్లికూతురి తరపువాళ్ళం. ఆ మాత్రమైనా చేయకపోతే ఎలా?"

"ఇక ఆ ఫీలింగ్స్ వదిలెయ్యండి. పెళ్లయిపోయింది కనుక మనమంతా ఒక కుటుంబ సభ్యులం."

"థాంక్స్. ఇంతకూ మీరు మా బావకు ఏమవుతారు? పని వత్తిడిలో కనుక్కోలేకపోయాను. సారీ."

"ఫర్వాలేదు. పెళ్లికొడుకు రమేష్ మా పెదనాన్న కొడుకు. మేమంతా ఒకే ఇంట్లో ఉంటాము. వాళ్ళు మేడపైన, మేము గ్రౌండ్ ఫ్లోర్‌లో."

"అలాగా. అయితే మా బావగారికి చెల్లెలన్న మాట మీరు. మా అక్కయ్యను జాగ్రత్తగా చూసుకోండి. తను చాలా మంచిది. అమాయకురాలు కూడా" అలా అంటున్నప్పుడు అతని కంట్లో నీరు తిరగడం చూసింది.

"మీరేం చింతపడకండి. వదినను మేము బాగా చూసుకుంటాం. మా పెదనాన్న వాళ్ళు కూడా చాలా మంచివాళ్ళు."

"థాంక్యూ" కన్నీరు సున్నితంగా తుడుచుకుంటూ అన్నాడు.

"మీ అక్కయ్యకు అంత ధైర్యం చెప్పారు మొన్న. ఈ రోజు మీరే ఇలా అయిపోయారే

మిటి?''

"ఇంకొకరికి చెప్పడం సులభమైన పనికదా'' అంటూ నవ్వి "మీ పేరు చెప్పలేదు'' అన్నాడు.

"సుష్మ.''



"నా పేరు చంద్రం.''

"తెలుసు. గత రెండురోజులుగా పెళ్లిపందిట్లో అందరి నోటా ఆ పేరే వినబడుతూ ఉంది.''

"మావాళ్ళ అభిమానం అలాంటిది.''

"అది మీ గొప్పతనం కూడా. వస్తానండీ.''

వెళ్తున్న సుష్మనే చూస్తూ ఏదో పోగొట్టుకున్నవాడిలా చూస్తుండిపోయాడు. ఆమె రెండురోజులే ఉన్నా అతని మనసులో ఎంతో అలజడిని రేపి వెళ్లిపోయింది.

★★★

నెలరోజుల తరువాత చంద్రం చెన్నైలో ఓ ఇంటర్వ్యూ అటెండ్ కావలసి వచ్చింది. ఎంతో ఉత్సాహంగా చెన్నైకి బయలుదేరాడు. తన అక్కతోపాటు సుష్మను కూడా చూడబోతున్నందుకు ఆ ఆనందం.

నిర్మల తమ్ముడిని చూసి చాలా సంతోషపడింది. రమేష్ కూడా బావమరిదిని బాగా రిసీవ్ చేసుకున్నాడు. సుష్మ వచ్చి పలుకరించి వెళ్లింది. సాయంత్రం సినిమా ప్రోగ్రాం వేసారు. సుష్మ కూడా తమతో బయలుదేరడం అతనికి ఎంతో ఆనందాన్నిచ్చింది.

సినిమా థియేటర్‌లో రమేష్, నిర్మల, నిర్మల పక్కన చంద్రం, అతని పక్కన సుష్మ కూర్చున్నారు. మంచి హిట్టయిన తమిళ సినిమా అది. లవ్ స్టోరీ. చంద్రానికి తమిళం రాదు కనుక సుష్మ అతనికి అర్థంకాని సీన్స్‌ని, డైలాగ్స్‌ని తెలుగులో వివరించింది.

ఆ రాత్రి చంద్రానికి నిద్ర పట్టలేదు చాలాసేపటి వరకు. పట్టాక కలలనిండా సుష్మే కనిపించింది.

మరుసటిరోజు నిర్మలతో "అక్కా! సుష్మ గురించి నీ అభిప్రాయం ఏమిటి?'' అని అడిగాడు.


"చాలా మంచి పిల్ల. చదువుకున్నది. అందమైనది. అయితే తను చాలా ఫాస్ట్. ఎవరితోనైనా ఇట్టే కలసిపోతుంది. నిర్ణయాలు తీసుకోవడంలో కూడా చాలా ఫాస్ట్.''

"నా ఉద్దేశ్యం నేను సుష్మను చేసుకుంటే ఎలా వుంటుందని?''

"నీవు సుష్మను ఇష్టపడుతున్నావా?''

"అవునక్కా. మీరందరూ ఒప్పుకుంటే పెళ్లి చేసుకోవాలనుకుంటున్నాను. అఫ్‌కోర్స్... పెళ్లికి ఇప్పుడే నాకు తొందరలేదు. ఇంకా మంచి ఉద్యోగం రావాలి నాకు. కాకపోతే తననుంచి, పెద్దవాళ్ళ దగ్గరనుంచి గ్రీన్‌సిగ్నల్ వస్తే నాకు రిలీఫ్‌గా వుంటుంది. మా విషయంలో కులం, మతం లాంటి ప్రాబ్లమ్స్ లేవు. ఇద్దరమూ మధ్య తరగతి వాళ్ళమే కనుక అంతస్థుల ప్రాబ్లమ్‌లేదు. ఇద్దరం చదువు పూర్తి చేసుకున్నవాళ్ళము. నాకు ఒక మంచి ఉద్యోగం వచ్చి స్థిరపడితే ఇంకే ప్రాబ్లమ్ ఉండదు.''

"నీవు తన అభిప్రాయం కనుక్కున్నావా?''



## బాల్యస్మృతులు

ఎంత వయసొచ్చినా చిన్ననాటి సంగతుల్ని జ్ఞాపకం చేసుకుంటే ఎంతో ఆనందంగా ఉంటుంది. కొంతమంది హీరోయిన్లు తమ తోబుట్టువులతోనే తలపడుతుంటారు. ఇక్కడ మనం చెప్పుకోవల్సింది రియా సేన్, రీమా సేన్‌ల గురించి. 'నాకు 14 ఏళ్ల ప్రాయంలోనే సినిమాలు నటించాలని ఉండేది. అయితే మమ్మీ వారించింది. కొంచెం పెద్దయ్యాక నటిద్దువుగాని అని చెప్పేది. రీమా నేనూ సినిమాలు చూస్తూ కాలం గడిపేసేవాళ్లం' అంటూ చిన్ననాటి జ్ఞాపకాల్ని పంచుకుంది రియాసేన్. 'ఝంకర్ బీట్స్' చిత్రం ఘనవిజయం సాధించడంతో రియా తనకిక తిరుగులేదన్నట్టుగా ఆత్మవిశ్వాసం వ్యక్తం చేస్తోంది. రియా సంగతి ఇలా ఉంటే రీమా యాంకరింగ్, టీవీ సీరియల్స్‌తో బిజీగా ఉంది. ఈ సోదరీమణులిద్దరి కెరీర్‌ని చూసి తల్లి మున్‌మున్‌సేన్ తెగ సంబరపడిపోతోందిట.

"ఇంకా లేదు."

"ఏమీ లేకుండా నీవు ఆశలు పెంచుకోకు. ఆమె ఆశలూ, ఆలోచనలూ ఎక్కడో ఉన్నాయి. నీవు సుష్మతో మాట్లాడు. నెగటివ్ రిప్లై వస్తే మాత్రం హర్ట్ కాకు."

"అలాగే. కానీ సుష్మ నన్ను కాదనదు. నాకా నమ్మకం వుంది."

"ఔనంటే నాకూ సంతోషమే. ఈ రోజు మెరీనా బీచ్‌కు వెళ్దామన్నారు మీ బావగారు. సుష్మను కూడా రమ్మంటాను. నీవు ఆలస్యం చేయకుండా అడుగు."

"అలాగే."

***

బీచ్‌లో చంద్రం ఇంటికి కావలసిన డెకొరేటివ్ ఐటమ్స్ కొన్ని కొన్నాడు. తల్లికోసం కొన్ని లేడీస్ ఐటమ్స్ కొన్నాడు.

అతనికి తమిళం రాదు కనుక సుష్మ అన్ని చోట్లా తనే మాట్లాడి బేరంచేసి అతనికి సహాయం చేసింది. అతని అక్కాబావలు వాళ్ల లోకంలో వాళ్లున్నారు.

సముద్రపు ఒడ్డున నలుగురూ కూర్చున్నారు. నిర్మల కావాలనే భర్తతో వీళ్లిద్దరికీ కాస్త దూరంగా కూర్చుంది.

ఇంతలో సుండల్ అమ్ముతూ ఒకతను వచ్చాడు. చంద్రం నలుగురికీ నాలుగు పొట్లాలు కొన్నాడు.

"నాకు చాలా ఇష్టమైన ఐటమ్ ఇది. మీరు నల్ల పయ్యా" అంది సుండల్ తింటూ.

"పయ్యా అంటే ఏమిటి?"

"అబ్బాయి అని అర్థం."

"నేను తెల్లగా ఉంటానని అందరూ అంటారే?"

"నల్ల అంటే నలుపురంగని కాదు. మంచి అని అర్థం. మిమ్మల్ని 'మంచి అబ్బాయి' అన్నాను."

"అలాగా. థాంక్స్."

కొంతసేపైన తరువాత అన్నాడు -

"సుష్మా! నేను ఒక మాట అడుగుతాను. ఏమను కోరుగా?"

"అడగండి" తల వంచుకుని అంది.

"నేను మిమ్మల్ని ఎంతో ప్రేమిస్తున్నాను. మిమ్మల్ని పెళ్లి చేసుకోవాలని కూడా అనుకుంటు న్నాను. నేనంటే మీకిష్టమేనా?"

"మీరంటే నాకూ ఇష్టమే. కాకపోతే మన ఉద్యోగాలు మనం ఆనందంగా గడపడానికి సరిపోవు."

"నేను మంచి ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్నాను. వస్తుందన్న నమ్మకం కూడా నాకుంది. మీరు నా ప్రేమను ఓకే చేసారన్న ఉత్సాహంతో నా ప్రయత్నాలు మరింత ఎక్కువ చేస్తాను."

"త్వరలోనే మా ఇంట్లో నా పెళ్లి ప్రయత్నాలు మొదలవుతాయి. ఇంకో సంవత్సరం వరకైతే వాయిదా వేయగలను. ఆ తరువాత నేను వద్దన్నా వాళ్ళు వినరు."

"నాకు ఆ గడువు చాలు. నేను రేపు బయలుదేరుతున్నాను. మీరు నాతో పెళ్లికి సుముఖంగా ఉన్నారనే ఆనందంతో నేను బయల్దేరనా?"

అలాగేనన్నట్లు కళ్లతో బదులిచ్చింది.

మరుసటి రోజు ఊరికి బయలుదేరుతూ సుష్మతో మాట్లాడిన విషయం చెప్పాడు.

"అయినా ఆమె నీకు గడువివ్వడం ఏమిటి? నువ్వు దానికే అంత సంతోషపడిపోవడం ఏమిటి? ప్రపంచంలో ఎక్కడా అమ్మాయిలే లేనట్లు నువ్వు అడగడం, తనేదో జగదేకసుందరి అయినట్లు ఆమె కండిషన్లు పెట్టడం నాకు నచ్చలేదురా" అంది నిర్మల.

"అక్కా! ఒకసారి మనసు పారేసుకున్నాక కొన్ని ఇబ్బందులు భరించాలి. కొన్ని ఇబ్బందిగా కూడా అనిపించవచ్చు. సరే. నేను వెళ్లొస్తాను."

రైల్వేస్టేషన్ బుక్‌స్టాల్‌లో 'ముప్పైరోజుల్లో తమిళ భాష' పుస్తకం కొన్నాడు. రేపు సుష్మతో పెళ్లయితే తరచుగా చెన్నై రావలసి వుంటుంది. భాష తెలిస్తే ఇబ్బంది ఉండదు అనుకుని ఆ పుస్తకం కొన్నాడు.

***

తరువాత రెండుసార్లు చెన్నై వెళ్లాడు చంద్రం. సుష్మతో సినిమాలకు, బీచ్‌కి తిరిగాడు. సుష్మ తల్లిదండ్రులు అడ్డు చెప్పకపోవడంతో వాళ్ళూ సుముఖంగానే ఉన్నారని అర్థమైంది అతనికి. సుష్మతో తన ఉద్యోగ ప్రయత్నాల గురించి చెప్పాడు.

రెండునెలల తరువాత స్టేట్‌బ్యాంక్ ప్రొబెషనరీ ఆఫీసర్స్ పరీక్ష పాసయ్యాడు. ఆ వార్త స్వయంగా సుష్మకు చెప్పాలని చెన్నై వచ్చాడు. వాకిట్లోనే కనబడింది సుష్మ.


తెల్లచీర, తెల్లరవిక, తలలో పూలతో చాలా అందంగా కనిపించింది అతని కళ్లకు. ఇంత అందగత్తె తన భార్య కావడం తన అదృష్టం అనుకున్నాడు.

"హాయ్" అంటూ పలకరించాడు ఆమెని.

"హాయ్" అని నవ్వి లోపలకు వెళ్లిపోయింది. హుషారుగా మేడ మెట్లు ఎక్కసాగాడు.

నిర్మల అతనికి మంచినీళ్లిచ్చి "ఒరేయ్ చందూ! నీకొక బ్యాడ్ న్యూస్."

"ఏమిటక్కా?" కంగారుగా అడిగాడు.



"సుష్మకు ఇందాకే పెళ్లిచూపులయ్యాయి."

ఒక్కక్షణం షాక్ తిన్నట్లు కూర్చుండిపోయాడు. తరువాత "సుష్మ ఒప్పుకుందా?" అని అడిగాడు.

"ఒప్పుకోకపోతే ఎలా కూర్చుంటుంది? అబ్బాయి పిజి చేసి అమెరికాలో ఉద్యోగం చేస్తున్నాడట."

"పెళ్లికొడుకు ఒప్పుకోవాలిగా" ఏ మూలో ఆశ ఇంకా ఉంది అతనిలో.

"ఒప్పుకున్నాడు. కట్నం వద్దట. పెళ్లి మాత్రం చేస్తే చాలుట."

"సుష్మతో నువ్వు మాట్లాడావా?"

"నీ విషయం మాట్లాడలేదు. అనవసరం అనిపించింది. తనే ఆ సంబంధం గురించి ఉత్సాహంగా చెబుతుంటే ఇంకేం మాట్లాడను?"

మౌనంగా ఉండిపోయాడు చంద్రం. ఆశలన్నీ కల్లలుకాగా కన్నీరు కళ్లనుంచి కారసాగింది.

"చందూ! వద్దురా బాధపడవద్దు. పోనీ నన్ను వెళ్లి అడగమంటావా? ఒట్టి పెళ్లిచూపులేగా అయింది. లేదా మీ బావగారిని మాట్లాడమంటాను. ఆయనా చాలా కోపంగా ఉన్నారు వాళ్ల మీద."

"వద్దక్కా. ఆమె మనసులో నాకు స్థానం లేదని తెలిసాక ఇక అడగడం అనవసరం. తప్పు నాదే. ఆమె ఉద్యోగం, డబ్బు, అంతస్థు కోరుకుంటోందని ఇప్పుడే తెలిసింది" అంటూ గదిలోకి వెళ్లిపోయాడు. బాధగా అతను వెళ్లినవైపే చూస్తుండిపోయింది నిర్మల.

★★★

సుష్మ పెళ్లయిన మూడునెలలకు చంద్రానికి కూడా పెళ్లయింది.

అనుకోకుండా ఓ సంబంధం రావడం, అమ్మాయి అందరికీ నచ్చడం జరిగింది. చంద్రం కూడా ఆఫీసర్ పోస్ట్‌కు ఇంటర్వ్యూ బాగా చేసి ఉండడంతో పెళ్లికి ఒప్పుకున్నాడు. సుష్మ కంటే అందమైన భార్య దొరకడమే కాదు, మంచితనం, అర్థం చేసుకునే తత్వం ఉన్న భార్య దొరికింది చంద్రానికి.

తన మంచితనంతో అందర్నీ కలుపుకుని మంచి భార్యగా, మంచి కోడలిగా పేరు తెచ్చుకుంది కళ్యాణి.

కొద్దిరోజుల్లోనే చంద్రంకు స్టేట్‌బ్యాంక్‌లో ప్రొబెషనరీ ఆఫీసర్‌గా ఉద్యోగం వచ్చింది. ట్రైనింగ్ అయ్యాక చెన్నైలోని ఓ బ్రాంచిలో పోస్టింగ్ ఇచ్చారు.

జాయినింగ్ రిపోర్టు ఇవ్వడానికి ఒంటరిగానే చెన్నై వచ్చాడు చంద్రం. నిర్మల ఇంట్లోకి పోబోతూ వాకిట్లో సుష్మను చూసి ఆశ్చర్యపోయాడు.

"హలో" అంటూ నవ్వాడు పలకరింపుగా.

తనూ "హలో" అంటూ నవ్వి లోపలకు వెళ్లిపోయింది.

ఆమె ఇదివరకున్నంత ఉత్సాహంగా లేదని అనిపించింది అతనికి.

తర్వాత నిర్మల చెప్పింది.

"అమెరికాలో ఉద్యోగావకాశాలు తగ్గిపోయాయి కదా. చాలామంది మళ్ళీ ఇండియాకే వచ్చేస్తున్నారట. సుష్మ భర్త ఎంఎస్‌సి కంప్యూటర్స్‌తోపాటు మరికొన్ని కంప్యూటర్ కోర్సులు చేసి అమెరికా వెళ్లాడు. వెళ్లగానే ఇలా అవడంతో తిరిగి వచ్చేసాడు.

అతను అమెరికా వెళ్లడానికి అయిన ఖర్చు కూడా ఇంకా సంపాదించలేదు. మన దేశంలో కూడా ఉద్యోగాలు అంత సులభంగా దొరకడం లేదుకదా. అందువల్ల సుష్మ మళ్లీ ఓ చిన్న ఉద్యోగంలో చేరింది. అయితే ఆమె ఇంట్లోకి రావడంవల్లే ఇలా అయిందని ఆమె అత్తగారు రోజూ సతాయిస్తూ ఉందట. అందువల్ల పుట్టింటికి వచ్చేసింది."

"అయ్యో పాపం. సుష్మ ఈ బాధ ఎలా తట్టుకొంటూంది?"

"ఎందుకురా పాపం. ఓ మంచి మనసును ఆశపెట్టి, ప్రోత్సహించి, మోసగించిందిగా! అనుభవించనీ" కోపంగా అంది నిర్మల.

"వద్దక్కా. అలా అనకు. భగవంతుడు ఏం చేసినా మన మంచికే చేస్తాడన్న నమ్మకం నాకుంది. సుష్మకు పెళ్లి నిశ్చయమైనప్పుడు ఎంతో బాధపడ్డాను. కోలుకోవడానికి నెలరోజులు పట్టింది నాకు.

అయితే ఈ రోజు నేను చాలా ఆనందంగా ఉన్నాను. కారణం కళ్యాణి. ఆమె సుష్మలా ఫాస్ట్‌గా నిర్ణయాలు తీసుకోదు. ప్రతి పనీ ఆలోచించే చేస్తుంది.


నా మనసెరిగి ప్రవర్తిస్తుంది. కాబట్టి సుష్మ ఆ రోజు తీసుకున్న నిర్ణయం నాకు మంచే చేసింది. కనుక ఆమెకూ మంచిరోజులు రావాలని కోరుకుంటున్నాను" అన్నాడు.

తమ్ముడి మంచితనానికి నిర్మల ముగ్ధురాలైంది.

అప్పుడే పైకి వచ్చిన సుష్మ చంద్రం మాటలు విన్నది.

తను కోల్పోయినదేదో అర్థమైంది. మౌనంగా మెట్లు దిగుతూ 'చంద్రం! ఐయామ్ సారీ. నేను పొరపాటు చేసాను' అనుకుంది.

★



## వింత మరణశిక్ష

మనిషిని మనిషి హత్య చేస్తే మరణశిక్ష తప్పదు. మరి బొద్దింకలకి మరణశిక్ష వేస్తే? ఇదేమిటి అని ఆశ్చర్యపోతున్నారా? థాయ్‌లాండ్ ప్రభుత్వం ఈ మధ్య అక్కడి 150 బొద్దింకలకు మరణశిక్ష విధించింది. సామూహికంగా అంత్యక్రియలు జరిగాయి. రుచికరమైన తినే ఆహార పదార్థాలపైన అవి తిరిగితే అసహ్యమేగా ఎవరికైనా? కుక్కల్ని, పిల్లుల్ని పెంచుకోవడం కొందరికి అలవాటు. కానీ బొద్దింకల్ని దొంగతనంగా పెంచుకుంటే అక్కడి ప్రభుత్వం పెద్ద జరిమానా విధిస్తుంది. నాలుగేళ్ళ జైలుశిక్ష లేదా పాతికవేలు జరిమానా విధిస్తుంది. మెడగాస్ తెగకు చెందిన ఒకామె 150 బొద్దింకల్ని రహస్యంగా పెంచుకోవడంతో దొరికిపోయింది. బౌద్ధ సాంప్రదాయం ప్రకారం వాటికి సామూహిక దహనక్రియలు జరిగాయి.

-శశి

